క్లుప్తంగా

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



నాదెండ్ల: విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేసి ప్రతి గ్రామం నుంచి ఒకరికి ఉచిత విద్యను అందిస్తున్నట్లు నరసరావుపేట టైనీ థాట్స్ విద్యా సంస్థల డైరెక్టర్ వై.కోటమ్మ చెప్పారు. మండలంలోని చందవరం ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉచితంగా సంస్థ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు సాయమందించేందుకు తాము ముందుంటామన్నారు. తమ సంస్థలో ప్రస్తుతం 50 మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. విద్యలో ప్రతిభ కనబరచిన వారిని గుర్తించి తల్లిదండ్రులు, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి వారిని ప్రోత్సహించాలన్నారు. తాను తన విద్యాభ్యాసం ప్రభుత్వం పాఠశాలలోనే పూర్తిచేశానన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో పాటూ తమలాంటి సంస్థలు అందించే సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు వీరయ్య చౌదరి, సతీష్, అన్నపూర్ణేశ్వరి, ఉపాధ్యాయులు షరీఫ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ ముసుగు శోభారాణి గురువారం శంకుస్థాపన చేశారు. రైతులు పొలాలకు వెళ్లే డొంక రోడ్లు అధ్వానంగా ఉండటంతో స్థానిక ఎమ్మెల్యే సహకారంతో రోడ్లు పనులు ప్రారంభించారు. గ్రామం నుండి కేసానుపల్లి వెళ్లే రోడ్డు, ఎన్ఎస్పీ కాలువ బ్రిడ్జి నుంచి కనపర్రు వెళ్లే రోడ్డు, ఎన్ఎస్పీ కాలువ బ్రిడ్జి నుంచి కాలువ కట్టవరకూ గ్రావెల్ రోడ్లు వేయనున్నారు. ఈ పనులు పూర్తయితే రైతులు, వాహనదారులకు రోడ్డు సౌకర్యం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, నాయకులు జంపని వీరవసంతరావు, నందిగం శివయ్య, నార్నె శ్రీనివాసరావు, శలభయ్య, ఈదర సాంబయ్య ఉన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకలు, డెంగ్యూ, మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహించారు. మండలంలో వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల మర్రిచెట్టుపాలెం గ్రామంలో గల అన్ని పాఠశాలలలో ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకలు జరిపి, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.రేవతి భాయి మాట్లాడుతూ తల్లిదండ్రులు కుటుంబ నియంత్రణ పాటించాలన్నారు. జనాభా పెరుగుదల వలన కలిగే లాభనష్టాలను వివరించారు. అదే విధంగా దోమల పెరుగుదల వలన, కలుషిత నీరు త్రాగడం వలన వచ్చే వ్యాధులు గురించి, నివారణ చర్యలు గురించి వివరించారు. ముఖ్యంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా టైర్లు, ఖాళీడబ్బాలు, కొబ్బరిబోండాలు, రోళ్లు, ప్లాస్టిక్ పాత్రల్లో నీటినిల్వల వల్ల దోమలు పెరిగి మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. మురుగునీటి నిల్వలు తీయటంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు లార్వాలు నిర్వీరం చేయాలన్నారు. మురుగు కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. దోమతెరలను ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఓ సురేష్ కుమార్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వందనం కాదిది.. నయవంచన

- తల్లికి వందనం అమలయ్యేనా?
- ఇప్పటికీ కార్యరూపం దాల్చని పథకం
- అయోమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు



ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామంటూ కూటమి మేనిఫెస్టోలో రెండవ అంశంగా పేర్కొన్న దృశ్యం

వినుకొండ(నూజెండ్ల): గతప్రభుత్వ హయాంలో చదువుకునే పేదవిద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం అమ్మఒడి పేరుతో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసే వారు. అయితే అప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులు నిశ్చింతగా ఉండేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సూపర్ సిక్స్ పథకాల పేరుతో తల్లికి వందనం పథకం పేరుతో చదువుకునే ప్రతిఒక్క విద్యార్థికి 15000 ఇస్తామని, ఇంటిలో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉన్నా అందరికీ నగదు జమ చేస్తామని గొప్పలు చెప్పారు.

తీరా పాఠశాలలు తెరిచి నెలరోజులు కావస్తున్నప్పటికీ ఇప్పటికీ అమ్మకు వందనం పథకం ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదు. ప్రయివేటు పాఠశాలల్లో ఇప్పటికే ఫీజులు చెల్లిమంటూ వత్తిడి చేస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇంటికి ఒకరికి మాత్రమే పథకం వర్తిస్తుందని ప్రస్తుతం ప్రచారం జరగుతుండంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

వినుకొండ నియోజకవర్గంలో..

వినుకొండ నియోజకవర్గంలో 315 ప్రభుత్వ, మరో 27 ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 35 వేలమందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే గతప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సైతం అమ్మఒడి పథకం క్రింద 25 వేల మందికిపైగా నగదు అందజేసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన ప్రతి విద్యార్థికీ తల్లికివందనం పథకం వర్తింపజేయాని ప్రజలు కోరుకుంటున్నారు.

ఇప్పటి వరకూ ఈ పథకంపై ఎలాంటి ముందడుగు పడకపోవటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు కట్టమని తల్లిదండ్రులను వత్తిడి చేస్తుండటంతో తల్లిదండ్రులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటప్రకారం ప్రతిఒక్కరికీ పథకం అందజేయాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రిపుల్ ఐటీలో పలువురికి చోటు

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోడ్డపాటి విజయలక్ష్మి గురువారం తెలిపారు. వారిలో గొల్లపూడి అభినయ వర్ధన్, కన్నెదారి వెంకట కళ్యాణ్, చెవల చంద్రశేఖర్‌లు ఉన్నారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీపీ ముండ్లమూరి అనిల్‌కుమార్ సుహాసిని, జెడ్పీటీసీ పారా హైమావతి, సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు దేవనబోయిన పోతురాజు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ముట్లూరు ప్రసాదు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే మండలంలోని పోట్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల్లో ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింగంశెట్టి అన్నపూర్ణమ్మ గురువారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు చల్లా నందకిషోరు (నూజివీడు)గడుపూడి వెంకట దినేష్ గడుపూడి ఛత్రపతి మనోజ్, గొట్టిపాటి రథీశ్వర్, షేక్ మస్తాన్‌వలీ (ఒంగోలు) దావులూరి శ్రీలక్ష్మి (శ్రీకాకుళం)లో సీట్లు సాధించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గడుపూడి వెంకటరాయుడు, పాఠశాల చైర్మన్ రామారావు, వైస్ చైర్మన్ యర్లగోర్ల తిరుపతమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సింగంశెట్టి అన్నపూర్ణమ్మ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

అలాగే మండలంలోని వేల్పూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గాను పదోవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహబుబ్ సుభాని గురువారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు పొత్తూరి భువన సాయి సుభాష్, దూళ్ళ సంతోష్, అద్దంకి పవన్‌కుమార్ (నూజివీడు) మర్రి యశోదర్ (ఇడుపులపాయ) గోరంట్ల యామిని,బొల్లా అనుపమ, నన్నెబోయిన సాయి త్రిష,గాలం యశ్వంత్ బాజి,బొల్లా వర్షిత, సగినాల వైష్ణవి (ఒంగోలు) కళాశాల్లో ఎంపికయ్యారు.

యడ్లపాడు మండలంలో..

యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెం, జగ్గాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి నందు అత్యధిక మార్కులు సాధించిన వారికి ఈ సీట్లు దక్కాయి. లింగారావుపాలెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన సయ్యద్ జావేద్ ట్రిపుల్ ఐటీ నూజివీడు నందు, గాండ్ల సుశాంత్ ట్రిపుల్ ఐటీ ఒంగోలు, అలాగే జగ్గాపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన టి.లక్ష్మిప్రియకు ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈసందర్భంగా వారిని ఆయా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.వి.రామిరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ మీరావలి, పాఠశాల ఉపాధ్యాయులు, నంబూరు శివరామకృష్ణ, ఎంఈఓ నాగరత్నం అభినందించారు

నాదెండ్ల మండలం...

నాదెండ్ల: ప్రకటించిన ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో నాదెండ్ల మండలానికి చెందిన తొమ్మిది మంది విద్యార్థులు సీట్లు సాధించారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన సోనాలి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో, యమున నూజివీడు ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించారు. చిరుమామిళ్ళశ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జాన్‌జోయల్, జెల్దిచెర్రీ ఒంగోలు, ఇడుపులపాయలో, చిరుమామిళ్ల ఏపీ మోడల్ పాఠశాలలో చదివిన షేక్ ముబీనా, డి.గాయత్రీ సంజీవని ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన బిత్రా అలేఖ్య ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో సీట్లు దక్కించుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్, విద్యాదాత నడికట్టు రామిరెడ్డి ఆయా పాఠశాలల హెచ్ఎంలు సుందరరావు, ఝాన్సీవాణి, వెంకటరావు, ఐ కృష్ణానాయక్, ఎంఈవోలు శ్రీలక్ష్మి, కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులను అభినందించారు.

రాజుపాలెం: మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చినట్లు ఎంఈవో-2 నరసింహారావు గురువారం తెలిపారు. గణపవరం జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన నర్రా కుమార్‌కు, అనుపాలెం జిల్లా పరిషత్ పాఠశాల నుంచి తదిటి సాయిలకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చినట్లు, అదే విధంగా ఇనిమెట్ల జిల్లా పరిషత్‌విద్యార్థిని ఎల్.సంజనకు ఒంగోలు ఐటీలో సీటు వచ్చినట్లు పేర్కొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు ప్రభుత్వ బాధ్యత

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



యల్లమందలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: ప్రతి ఇంటికీ తాగునీరు అందించే బాధ్యతను టీడీపీ కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా మండలంలోని యల్లమంద, కోటప్పకొండల్లో చేపట్టనున్న పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ ప్రతి గడపకు తాగునీరు ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. యల్లమందలో రూ.40 లక్షలు, కోటప్పకొండలో రూ.4 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వివరించారు. కోటప్పకొండ స్కీం ద్వారా కోటప్పకొండతో పాటు యక్కలవారిపాలెం, కొండకావూరు, కట్టుబడివారిపాలెం, మోపిదేవి వారిపాలెం గ్రామాల్లోని ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కడియాల రమేష్ బాబు, ఎర్రమాసు ఆంజనేయులు, ముప్పాళ్ల నాగేశ్వరరావు, కడియాల తాండవకృష్ణ, రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ నాయకుడికి పితృవియోగం



వలి పార్థివ దేహనికి నివాళి అర్పిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: మండలంలో విప్పర్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ నాయకుడు తుమ్మలచెరువు ఖాదర్ భాషా తండ్రి ముస్లిం పెద్ద తుమ్మలచెరువు వలి (70) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆ గ్రామానికి వెళ్లి ఆయన స్వగృహంలో వలి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన కుటుంబ సభ్యులు పార్టీకి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ గెల్లి చినకోటిరెడ్డి, పునుగోటి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు పడాల హనిమిరెడ్డి, మానుకొండ రామిరెడ్డి, షేక్ ఖాదర్ భాషా, జాగర్లమూడి వసంత రావు, కాశీనీడి మస్తానయ్య, తాడువాయిరాఘవరావు పాల్గొన్నారు.

అన్నవరంలో పర్యటన

మండలంలో అన్నవరం గ్రామంలో గురువారం నరసరావుపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. గ్రామానికి విచ్చేసిన ఆయనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆ గ్రామంలో భుజం నొప్పితో బాధపడుతూ సర్జరీ చేయించుకున్న మార్కె ట్ యార్డ్ మాజీ చైర్మన్ పచ్చవ రవీంద్రబాబును పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం కొరకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మైనార్టీ నాయకులు ఖాదర్ భాషా, మాజీ సర్పంచ్‌లు గెల్లి చినకోటిరెడ్డి, పునుగోటి వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పడాల హనిమిరెడ్డి, వసంతరావు, మానుకొండ రామిరెడ్డి, నాని తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరీ దేవిగా దుర్గా అన్నపూర్ణేశ్వరి

సత్తెనపల్లి: ఆషాఢ మాసం పురస్కరించుకొని దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో గురువారం దుర్గా అన్నపూర్ణేశ్వరి అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకాంబరీ దేవిగా అలంకరణ చేశారు.

పమిడిపాడులో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నరసరావుపేటరూరల్: మండలంలోని పమిడిపాడు గ్రామంలో శ్రీ దత్త హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో హాస్పిటల్ మేనేజింగ డైరెక్టర్, గుండె వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చల్లా వెంకటేశ్వరరావు, స్త్రీ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ శాంతిలు పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు జరిపారు. 150 మందికి పరీక్షించి వారికి ఉచితంగా బీపీ, షుగరు, ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు కార్పోరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, రైతుకూలీలను దృష్టిలో ఉంచుకొని వారి సమయానుకూలంగా ఈవినింగ్ హెల్త్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ దత్త సూపర్ స్పెషాలిటి హాస్పిటల్‌లో గుండె, కిడ్నీ, మెదడు, వెన్నుముక, ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు, బీపీ, షుగర్, స్త్రీ, ప్రసూతి వ్యాధులకు, అన్నిరకాల ఎమర్జెన్సీలకు అనుభవజ్ఞులైన వైద్యుల సమక్షంలో వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసీం సైదా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఫరూక్, శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీలకు అనుమతులు తప్పనిసరి

పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గంలో మిరప నర్సరీల నిర్వహణ యజమానులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని ఉద్యాన శాఖాధికారి తోటకూర శ్రీనిత్య కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనిత్య మాట్లాడుతూ తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. పలువురు మిరప నర్సరీల యజమానులతో ఆమె మాట్లాడారు. నర్సరీలను నిర్వహించే యజమానులు తప్పనిసరిగా రెండు ద్వారాలు ఏర్పాటు చేసుకోవాలని, బెడ్‌ల మధ్య దూరం ఉండాలన్నారు. గడ్డి రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. లైసెన్స్ లేని యజమానులకు నోటీసులు అందించారు.

ప్రారంభానికి సిద్ధంగా బస్ షెల్టర్



అచ్చంపేట: స్థానిక పీహెచ్‌సీ, జెడ్పీ హైస్కూలు, శివాలయాలకు సమీపంలో స్నేహ హస్తాలు ఫౌండేషన్ వారిచే రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన బస్ షెల్టర్ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నెల 13న స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలచే ప్రారంభించ బడుతుందని స్నేహ హస్తాలు ఫౌండేషన్ ప్రతినిధి తాయి కరిముల్లాబాబు గురువారం తెలిపారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలు, 28 గ్రామాలుండగా బస్టాండు ఊరికి కిలోమీటరు దూరంలో నిర్మించడం వల్ల ప్రయాణికులెవ్వరూ బస్టాండుకు వెళ్లడం లేదని, బస్సులను కూడా హైస్కూలు వద్దనే తిప్పుతున్నారని చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వివిధ పనులపై వచ్చే విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, వైద్యశాలకు వచ్చే రోగులు గంటల తరబడి రోడ్డుపై వేచి ఉండాల్సి రావడాన్ని గమనించి పంచాయతీ అనుమతితో బస్ షెల్టర్ నిర్మించినట్లు కరిముల్లా బాబు తెలిపారు.